## జీఎస్టీ వసూళ్లు ఆల్‌టైమ్ హై




ఏప్రిల్‌లో రూ.2.37 లక్షల కోట్లు

న్యూఢిల్లీ, మే 1: జీఎస్టీ వసూళ్లు రికార్డు స్థాయిలో నమోదయ్యాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి నెల ఏప్రిల్‌లో రూ.2.37 లక్షల కోట్ల మేర జీఎస్టీ వసూలైనట్టు కేంద్ర ప్రభుత్వం తాజాగా వెల్లడించింది. క్రితం ఏడాది ఇదే నెలలో వసూలైన రూ.2.10 లక్షల కోట్లతో పోలిస్తే 12.6 శాతం అధికమని పేర్కొంది. జీఎస్టీ అమలులోకి వచ్చిన జూలై 1, 2017 తర్వాత ఇదే అత్యధిక వసూళ్లు కావడం విశేషం. ఈ ఏడాది మార్చి నెలలో రూ.1.96 లక్షల కోట్లు వసూలయ్యాయి. గడిచిన నెలలో వసూలైనదాంట్లో దేశీయంగా రూ.1.96 లక్షల కోట్లు వసూళ్లు జరిగాయి. గతేడాదితో పోలిస్తే 10.7 శాతం మేర పెరిగాయి. వీటిలో సెంట్రల్ జీఎస్టీ కింద రూ.48,634 కోట్లు వసూలవగా, స్టేట్ జీఎస్టీ కింద రూ.59,372 కోట్లు, ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ కింద రూ.69,504 కోట్లు, సెస్ రూపంలో రూ.12,293 కోట్లు వసూలయ్యాయి. దేశ ఆర్థిక రంగం బలంగా ఉందన్నడానికి ఈ జీఎస్టీ వసూళ్లే నిదర్శనమని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి నెలలోనే పన్ను వసూళ్లు రూ.2 లక్షల కోట్ల మైలురాయి దాటిందని డెలాయిట్ ఇండియా పార్టనర్ ఎంఎస్ మణి తెలిపారు. అత్యధిక ఉత్పత్తి, వినిమయ రాష్ట్రాల్లో జీఎస్టీ వసూళ్లలో వృద్ధి 11 శాతం నుంచి 16 శాతం మధ్యలో నమోదవడం వల్లనే రికార్డు స్థాయికి చేరుకున్నాయన్నారు.

**ఇప్పటి వరకు రికార్డు స్థాయిలో జీఎస్టీ వసూళ్లు**

| | |
|---|---|
| ఏప్రిల్ 2025 | రూ.2.37 లక్షల కోట్లు |
| ఏప్రిల్ 2024 | రూ.2.10 లక్షల కోట్లు |
| మార్చి 2025 | రూ.1.96 లక్షల కోట్లు |

## వాహన విక్రయాలు అంతంతే

న్యూఢిల్లీ, మే 1: మార్కెట్ పరిస్థితులు నిరుత్సాహకరంగా ఉన్నప్పటికీ గడిచిన నెలలో వాహన విక్రయాలు ఆశించిన స్థాయిలో నమోదయ్యాయి. కార్ల తయారీలో అగ్రగామి సంస్థలు మారుతి సుజుకీ, మహీంద్రా అండ్ మహీంద్రా విక్రయాలు పెరగగా..టాటా మోటర్స్, హ్యుందాయ్ సేల్స్ తగ్గుముఖం పట్టాయి. అయినప్పటికీ మహీంద్రా రెండో స్థానానికి, టాటా మోటర్స్ మూడో స్థానానికి ఎగబాకింది. కానీ, రెండో స్థానంలో కొనసాగిన హ్యుందాయ్ ఈసారి నాలుగో స్థానంతో సరిపెట్టుకున్నది. మారుతి అమ్మకాలు ఏడు శాతం అధికమయ్యాయి.

**ఏప్రిల్ నెలలో వాహన అమ్మకాలు**

| సంస్థ | 2025 | 2024 | వృద్ధి(శాతంలో) |
|---|---|---|---|
| మారుతి | 1,79,791 | 1,68,089 | 7 |
| మహీంద్రా | 84,170 | ==== | 19 |
| టాటా మోటర్స్ | 72,753 | 77,521 | -6.1 |
| హ్యుందాయ్ | 60,774 | 63,701 | -5 |
| టయోటా కిర్లోస్కర్ | 27,324 | 20,494 | 33 |
| ఎంజీ మోటర్స్ | 5,829 | 4,725 | 23 |
| కియా ఇండియా | 23,623 | 19,968 | 18 |
| హోండా కార్స్ | 3,360 | 4,351 | -23 |
| ద్విచక్ర వాహనాలు | | | |
| టీవీఎస్ మోటర్ | 4,43,896 | 3,83,615 | 16 |
| సుజుకీ మోటర్‌సైకిల్ | 1,12,948 | 99,377 | 14 |
| రాయల్ ఎన్‌ఫీల్డ్ | 86,559 | 82,043 | 6 |

# హైదరాబాద్ ఆఫీస్ ఖాళీ

**వృథాగా 284 లక్షల చదరపు అడుగుల్లో కార్యాలయ స్థలాలు**


**దేశంలోనే అత్యధికం.. ఆ తర్వాత ఢిల్లీ-ఎన్‌సీఆర్**

**అద్దెకు పెద్దగా ఆసక్తి చూపని కార్పొరేట్లు: వెస్టియన్**

*ఈ నగరానికి ఏమైంది. అవును.. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌ను చూస్తే ఇలాంటి ప్రశ్నలే తలెత్తుతున్నాయిప్పుడు.*

*ఒకప్పుడు హాట్‌కేకుల్లా అమ్ముడుపోయిన ఆఫీస్ స్పేస్.. ఇప్పుడు ఆదరణ లేక కళావిహీనంగా కనిపిస్తున్నది. అద్దెకు తీసుకునేవారే కరువైపోయారు మరి.*

*గతంలో ఇక్కడ కార్యాలయాలను ఏర్పాటు చేసుకొనేందుకు క్యూ కట్టిన కార్పొరేట్లు.. ప్రస్తుతం ముఖం చాటేస్తున్నారు. దీంతో లక్షల చదరపు అడుగుల్లో కార్యాలయ స్థలాలు ఖాళీగా ఉన్నాయంటూ రియల్ ఎస్టేట్ రిపోర్టులు వస్తున్నాయి.*



న్యూఢిల్లీ, మే 1: హైదరాబాద్‌లో కార్యాలయ స్థలాలకు పెద్దగా ఆదరణే లేకుండాపోయింది. ఒకప్పుడు దేశంలోని ప్రధాన నగరాలను వెనక్కినెడుతూ ఆఫీస్ స్పేస్ మార్కెట్‌లో దూసుకుపోయిన రాష్ట్ర రాజధాని నగరానికి ఇప్పుడు డిమాండ్ కనిపించడం లేదు. ఏడాదిన్నర క్రితం వరకు హైదరాబాద్‌లో ఆఫీస్‌ను ఏర్పాటు చేసేందుకు ఉత్సాహం చూపిన కార్పొరేట్లు.. ప్రస్తుతం ఆసక్తి చూపించడం లేదు. ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ వెస్టియన్ విడుదల చేసిన తాజా గణాంకాలే ఇందుకు నిదర్శనం.

**284 లక్షల చదరపు అడుగుల్లో..**

దేశంలోని 7 ప్రధాన నగరాల ఆఫీస్ స్పేస్ మార్కెట్‌పై వెస్టియన్ సర్వే చేసింది. దీని వివరాల ప్రకారం హైదరాబాద్‌లోనే గరిష్ఠంగా కార్యాలయ స్థలాలు వృథాగా పడిపోయి ఉన్నట్టు తేలింది. ఏకంగా 284 లక్షల చదరపు అడుగుల్లో ఆఫీస్ స్పేస్ ఖాళీగా ఉన్నదని వెస్టియన్ ఈ సందర్భంగా వెల్లడించింది. ఈ ఏడాది మార్చి నాటికి హైదరాబాద్‌లో మొత్తం అందుబాటులో ఉన్న ఆఫీస్ స్పేస్ 1,620 లక్షల చదరపు అడుగులు. ఇందులో 284 లక్షల చదరపు అడుగులు ఖాళీగానే ఉన్నది. ఇది మొత్తం స్టాక్‌లో 17.5 శాతానికి సమానం. కార్పొరేట్ కంపెనీలు అద్దెకు తీసుకొనేందుకు పెద్దగా ఆసక్తి చూపట్లేదని వెస్టియన్ పేర్కొన్నది. కాగా, గతంలోనూ ఆయా నగరాల్లో ఆఫీస్ స్పేస్ ఖాళీలుండేవి. అయితే హైదరాబాద్‌లో మాత్రం ఇందుకు భిన్నమైన పరిస్థితి కనిపించేది. దాంతో ఆఫీస్ స్పేస్ గిరాకీలో నగరం ఎప్పుడూ టాప్‌లో ఉండేది. మిగతా నగరాలతో పోల్చితే లీజింగ్ పెద్ద ఎత్తున జరిగేది మరి. కానీ మారిన పరిస్థితులతో ఇప్పుడు ఖాళీల్లో టాప్‌లో ఉంటున్నది.

**ఆగిన కొత్త నిర్మాణాలు**

ఇప్పటికే నిర్మాణం పూర్తయ్యి అందుబాటులో ఉన్న ఆఫీస్ స్పేస్‌కు గిరాకీ అంతంత మాత్రంగానే ఉండటంతో కొత్త నిర్మాణాలు దాదాపుగా ఆగిపోయాయి. రియల్టర్లు, ఆఫీస్ స్పేస్ నిర్మాణ కంపెనీలు నూతన ప్రాజెక్టులకు దూరంగా ఉంటున్నాయి. ఫలితంగా సిమెంట్, ఉక్కు, ఇతర నిర్మాణ అనుబంధ రంగాలు కుదేలయ్యాయి. వాటిమీద ఆధారపడుతున్న పరిశ్రమలు, వ్యాపారులు, ఉద్యోగులు, కూలీల భవిష్యత్తు ఆందోళనలో పడింది. నిజానికి హైదరాబాద్‌లో ఖాళీగా ఉన్న కార్యాలయ స్థలాలు మునుపు ఇంకా ఎక్కువ (19 శాతం)గానే ఉండేవి. కానీ కొత్త ప్రాజెక్టులు రాకపోవడంతో ఇవి కాస్త తగ్గాయి. కాగా, హైదరాబాద్, ఢిల్లీ-ఎన్‌సీఆర్, బెంగళూరు, ముంబై, చెన్నై, కోల్‌కతా, పుణె నగరాలపై వెస్టియన్ సర్వే చేసింది.

**బీఆర్ఎస్ హయాంలోనే బాగుబాగు**

ఉమ్మడి రాష్ట్రంలో నత్తనడకన సాగిన అభివృద్ధి.. విభజన అనంతరం తెలంగాణలో పరుగులు పెట్టింది. రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయాలు అన్ని రంగాలను బలపర్చాయి. ఐటీ, ఫార్మా, ఆటో, ఏవియేషన్, డిఫెన్స్ ఇలా కీలక రంగాలు వృద్ధిపథంలో పయనించాయి. ఇది ఇక్కడి నిర్మాణ రంగానికి ఊహించని స్థాయిలో డిమాండ్‌ను తెచ్చిపెట్టింది. ముఖ్యంగా ఆఫీస్ స్పేస్‌కు గిరాకీని అమాంతం పెంచేసింది. దేశ, విదేశీ సంస్థలు హైదరాబాద్‌లో తమ కార్యాలయాలను ఏర్పాటు చేసేందుకు భారీగా ముందుకొచ్చాయి. భారత్‌లోకి రావాలంటే హైదరాబాద్‌నే ప్రధాన కేంద్రంగా చేసుకోవాలన్నంతగా డిమాండ్ నెలకొన్నదంటే ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. ఈ క్రమంలోనే మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్ వంటి అనేక సంస్థలు హైదరాబాద్‌లో బడాబడా ఆఫీసులను తీసుకొచ్చాయి. మరెన్నో స్టార్టప్‌లూ కొలువుదీరాయి. ఫలితంగా ఆఫీస్ మార్కెట్ వేగంగా విస్తరించింది. దాదాపు పదేండ్ల టీఆర్ఎస్, బీఆర్ఎస్ పాలనలో ఇలాగే సాగిందంతా. కానీ రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో అంతా తలకిందులైంది. ఏడాదిన్నరగా పెట్టుబడులు రాక మార్కెట్‌లో స్తబ్ధత నెలకొన్నది. అందుకు ఆఫీస్ స్పేస్ మార్కెట్ అద్దం పడుతున్నది.

- దేశంలోని ప్రధాన నగరాల్లో హైదరాబాద్‌లోనే అత్యధికంగా ఆఫీస్ స్పేస్ ఖాళీలు. ఆ తర్వాత ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో ఉన్నాయి.
- బెంగళూరు (2,805 లక్షల చదరపు అడుగులు) తర్వాత ఎక్కువగా ఆఫీస్ స్పేస్ అందుబాటులో ఉన్నది హైదరాబాద్ (1,620 లక్షల చదరపు అడుగులు)లోనే.
- బీఆర్ఎస్ హయాంలో హైదరాబాద్ ఆఫీస్ స్పేస్ మార్కెట్‌లో జోరుగా డిమాండ్-సప్లై. ఇప్పుడు డిమాండ్ లేకపోవడంతో సప్లై కూడా ఆగిపోయింది.
- ఈ ఏడాది జనవరి-మార్చిలో దేశీయంగా ఆఫీస్ స్పేస్ లీజింగ్ 34 శాతం పెరిగి 179.6 లక్షల చదరపు అడుగులకు చేరిక.
- జీసీసీలు, ఐటీ, ఐటీ అనుబంధ రంగాలు, బ్యాంకింగ్, ఆర్థిక, బీమా రంగాల నుంచి కనిపించిన డిమాండ్.

**దేశంలోని 7 ప్రధాన నగరాల్లో ఖాళీ ఆఫీస్ స్పేస్ నిల్వలు**

| నగరం | లక్షల చ.అడుగుల్లో |
|---|---|
| హైదరాబాద్ | 284 |
| ఢిల్లీ-ఎన్‌సీఆర్ | 232 |
| బెంగళూరు | 210 |
| ముంబై | 125 |
| కోల్‌కతా | 79 |
| చెన్నై | 60 |
| పుణె | 56 |

## కాగ్నిజెంట్‌లో 20 వేల ఉద్యోగాలు

న్యూఢిల్లీ, మే 1: అమెరికాకు చెందిన ఐటీ సేవల సంస్థ కాగ్నిజెంట్..ప్రస్తుతేడాది 20 వేల మంది ఫ్రెషర్లను నియమించుకోనున్నట్టు ప్రకటించింది. కృత్రిమ మేధస్సుతో సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్‌పై మంచి పట్టున్న ఉద్యోగులను రిక్రూట్ చేసుకోనున్నది. నూతన టెక్నాలజీ సేవలకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్టు, గతేడాది రిక్రూట్ చేసుకున్నవారి కంటే రెండింతలు అధికంగా ఈసారి నియమించుకోనున్నట్టు కాగ్నిజెంట్ సీఈవో రవి కుమార్ ఎస్ తెలిపారు. ప్రస్తుతం సంస్థలో 3,36,300 మంది ఉద్యోగులు ఉన్నారు.

## దిగొస్తున్న బంగారం ధర

**హైదరాబాద్‌లో తులం రూ.2,180 డౌన్ • 24 క్యారెట్ రూ.95,730**

హైదరాబాద్, మే 1: నిన్నమొన్నటిదాకా ఆకాశమే హద్దుగా పరుగులు పెట్టిన బంగారం ధరలు.. ఇప్పుడు అంతే వేగంగా దిగొస్తున్నాయి. గురువారం ఒక్కరోజే హైదరాబాద్‌లో 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) 10 గ్రాముల రేటు రూ.2,180 తగ్గి రూ.95,730 వద్ద స్థిరపడింది. 22 క్యారెట్ (99.5 స్వచ్ఛత) తులం విలువ కూడా రూ.2,000 పడిపోయి రూ.87,750 వద్ద నిలిచింది. నిజానికి గత వారం రోజులుగా గోల్డ్ రేట్లు క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయి. అంతకుముందు తులం రేటు తొలిసారి లక్ష రూపాయల మార్కును దాటిపోయిన విషయం తెలిసిందే. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతీకార సుంకాలు, వివిధ కారణాలతో పతనమైన స్టాక్ మార్కెట్ల వల్ల దేశీయ మార్కెట్‌లో పుత్తడి ధరలు వరుసగా పెరుగుతూపోయాయి. అయితే అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వస్తున్న బలహీన సంకేతాల నడుమ ధరలు దిగువ ముఖం పడుతున్నాయి.







## లోహియా బిస్కెట్ ప్లాంట్

హైదరాబాద్, మే 1: హైదరాబాద్‌కు సమీపంలో మేడ్చల్ వద్ద వరల్డ్ క్లాస్ బిస్కెట్ తయారీ యూనిట్‌ను ప్రారంభించింది లోహియా గ్రూపు. ఏడు ఎకరాల స్థలంలో ఏర్పాటు చేసిన ఈ యూనిట్‌లో ప్రస్తుతం నెలకు 1000 టన్నుల బిస్కెట్లు తయారుకానుండగా, వచ్చే నాలుగేండ్లలో ఈ సామర్థ్యాన్ని 5 వేల టన్నులకు పెంచుకోనున్నట్టు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. వచ్చే నాలుగేండ్లలో రూ.300 కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్టు ప్రకటించింది.

## హైదరాబాద్‌లో ఆల్ట్.ఎఫ్ కో-వర్కింగ్ ఆఫీస్

హైదరాబాద్, మే 1: కో-వర్కింగ్ నిర్వహణ సంస్థ ఆల్ట్.ఎఫ్..హైదరాబాద్‌లో నూతన కార్యాలయాన్ని తెరిచింది. 56 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ సెంటర్‌లో 1,200 మందికి పైగా కూర్చోవడానికి వీలుంటుందని పేర్కొంది. సౌకర్యవంతమైన కార్యాలయాల మార్కెట్ భారీ వృద్ధిని నమోదు చేసుకుంటున్న హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన తొలి సెంటర్ ఇదేనని కంపెనీ కో-ఫౌండర్ యోగేశ్ అరోరా తెలిపారు. ఒక్కో డెస్క్ నెలకు రూ.8 వేల చొప్పున చార్జీ వసూలు చేస్తున్నట్టు చెప్పారు. ప్రస్తుతం సంస్థ..ఢిల్లీ, నోయిడా, గురుగ్రామ్‌లలో కో-వర్కింగ్ కార్యాలయాలను నిర్వహిస్తున్నది.

# బరితెగిస్తున్న మెడికల్ మాఫియా?

- పెద్దపల్లి జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా స్కానింగ్ సెంటర్లు
- అధికారపార్టీ అండతో ఇష్టారాజ్యం?
- తనిఖీలకు వచ్చిన అధికారులపైనే బెదిరింపులు!
- ఇటీవల గోదావరిఖనిలో డీఎంహెచ్‌వోపైనే కేసు
- కాంగ్రెస్ నాయకుల తీరుపై విమర్శలు




*గత నెల 26న గోదావరిఖనిలో అల్ట్రా సాండ్ స్కానింగ్ మిషన్‌ను సీజ్ చేస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో అన్న ప్రసన్న కుమారి*

**పెద్దపల్లి జిల్లాలో మెడికల్ మాఫియా బరితెగిస్తున్నాదా..? అధికారపార్టీ నాయకుల అండదండలతో రెచ్చిపోతున్నదా..? అనుమతులు లేకుండా స్కానింగ్ సెంటర్లు నిర్వహిస్తున్నదా..? అడ్డువచ్చిన అధికారులనే బెదిరిస్తున్నదా..? అంటే అవుననే సమాధానం వస్తున్నది. ఇటీవల గోదావరిఖనిలో తనిఖీలకు వచ్చిన డీఎంహెచ్‌వోపైనే కేసు నమోదు కావడం ఆరోపణలకు బలం చేకూరుస్తున్నది.**

పెద్దపల్లి, మే 1 (నమస్తే తెలంగాణ) : దేశంలో ఆడపిల్లల సంఖ్య తగ్గుతుండడాన్ని సీరియస్‌గా తీసుకున్న కేంద్రం, లింగ నిర్ధారణ పరీక్షలపై మూడు దశాబ్దాల క్రితమే నిషేధం విధించింది. ఒక వేళ లింగ నిర్ధారణ చేసినా.. అబార్షన్లు చేసినా చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకోనున్నది. ఇదే సమయంలో బాలికల రక్షణ కోసం 'భేటీ బచావో.. భేటీ పడావో' అంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నాయి. కానీ, పెద్దపల్లి జిల్లాలో అధికారపార్టీ నాయకుల అండదండలతో ఆ స్ఫూర్తి దెబ్బతింటున్నదనే ఆరోపణలున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా స్కానింగ్ సెంటర్లను నడపడమే కాదు, గుట్టురట్టు చేసిన అధికారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారనే విమర్శలున్నాయి. ఇటీవల గోదావరిఖనిలో తనిఖీకి వచ్చిన ఉన్నతాధికారిపైనే ఏకంగా కేసు నమోదు తీవ్ర విమర్శలకు తావిచ్చింది.

**డీఎంహెచ్‌వోకే బెదిరింపులు**

ఆరు నెలల క్రితం పెద్దపల్లి డీఎంహెచ్‌వోగా బాధ్యతలు స్వీకరించిన అన్న ప్రసన్నకుమారి ఆకస్మిక తనిఖీలతో హడలెత్తిస్తున్నారు. అనుమతి లేని వైద్యంపై కొరడా ఝులిపిస్తున్నారు. మార్చిలో ధర్మారం మండలంలోని సూర్య ఆదిత్య స్కానింగ్ సెంటర్‌ను సీజ్ చేశారు. అదే విధంగా ధర్మారంలో ఓ ప్రైవేట్ దవాఖాన రిజిస్ట్రేషన్ లేకుండా నడుస్తుండడంతో దాన్ని సైతం సీజ్ చేశారు. ఇటీవల పెద్దపల్లిలో బొమ్మినేని హాస్పిటల్‌ను సీజ్ చేశారు. సుల్తానాబాద్‌లో సైతం అనుమతులు లేకుండా నడుస్తున్న ఓ వైద్యశాలను సీజ్ చేశారు. గత నెల 26న గోదావరిఖనిలో ఆకస్మికంగా తనిఖీలు చేయగా.. ఏకంగా ఆమెపైనే కేసు నమోదు కావడం, తిరిగి కాంగ్రెస్ నాయకులపైన కేసులు నమోదు కావడం సంచలనం సృష్టించింది. అయితే అధికారపార్టీ నాయకుల అండదండలతోనే ఇదంతా జరిగినట్టు తెలిసింది. అసలేం జరిగిందో డీఎం అండ్‌హెచ్‌వో అన్నప్రసన్న కుమారి వివరాల ప్రకారం.. ఏప్రిల్ 26న ఉదయం 9గంటలకు డీఎంహెచ్‌వో గోదావరిఖనిలోని శ్రీ మమత హాస్పిటల్‌కు చేరుకున్నారు. అక్కడ అనధికారికంగా చేపడుతున్న లింగ నిర్ధారణ పరీక్షలపై ఆమె ప్రశ్నలు కురిపించడంతో వైద్య సిబ్బంది మెల్లిగా జారుకున్నారు. స్కానింగ్ మిషన్ ఎక్కడ ఉంది? అని నిలదీసినా మిగిలిన సిబ్బంది స్పందించ లేదు. అప్పుడు ఆమె కోప్పడడంతో అల్ట్రా సౌండ్ స్కానింగ్ యంత్రం ఉన్న గది తలుపులు తెరవక తప్పలేదు. తలుపులు తెరుచుకున్న తర్వాత ఒక్కరొక్కరుగా ఆ దవాఖాన భాగస్వాములు రావడం మొదలైంది. కాంగ్రెస్ నాయకుడు, రామగుండం నగర మాజీ మేయర్ అనీల్‌కుమార్ తోపాటు గోదావరిఖని ప్రభుత్వ దవాఖాన ఆర్థో వైద్యుడు నాగిరెడ్డి, ఐఎంఏ అధ్యక్షుడు కే శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్, కాంగ్రెస్ నాయకుడు మహంకాళి స్వామి, గోదావరిఖని ప్రభుత్వ దవాఖాన వైద్యురాలు ఆర్‌జే స్వాతి, మంథని సామాజిక వైద్యశాలలో ఫిజిషియన్‌గా పనిచేస్తున్న రాజశేఖర్ అక్కడికి చేరుకొని, భయానక వాతావరణం సృష్టించారు. బతకాలని ఉంటే ఇక్కడి నుంచి వెంటనే వెళ్లిపోవాలని, గోదావరిఖనిలో దవాఖానలను తనిఖీ చేసి బతికి బట్టకట్ట లేవంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినా భయపడని డీఎంహెచ్‌వో స్కానింగ్ యంత్రాన్ని సీజ్ చేసి పంచనామాను సిద్ధం చేయడంతో దురుసుగా ప్రవర్తించి, పంచనామా ప్రతులను చింపివేశారు. దీంతో ఆమె అక్కడి నుంచి రామగుండం తహసీల్ ఆఫీస్‌కు వెళ్లి డాక్యుమెంట్లను సిద్ధం చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఒక వైపు తనీఖీలు చేయకుండా విధులకు ఆటంకం పరిచి ముందుగానే గోదావరిఖని పోలీసు స్టేషన్‌కు వెళ్లి డీఎంఅండ్‌హెచ్ఓపైనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ ఫిర్యాదు చేశారు. డీఎంఅండ్‌హెచ్‌వో సైతం అదే సామాజిక వర్గానికి చెందిన మహిళ కావడంతో నాలుక కర్చుకున్న కాంగ్రెస్ నాయకులు, దవాఖాన సిబ్బందిపై డీఎంహెచ్‌వో దౌర్జన్యం చేశారనే కేసు నమోదు చేయించారు. ఇదే సమయంలో సదరు దవాఖాన డాక్టర్ నాగిరెడ్డితోపాటు మాజీ మేయర్ డాక్టర్ బింగి అనిల్‌కుమార్, పిల్లల వైద్య నిపుణులు క్యాస శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకుడు మహంకాళి స్వామితోపాటు మరికొంత మంది తన విధులను అడ్డుకున్నారని, దౌర్జన్యానికి దిగుతూ, దుర్భాషలాడారని డీఎంహెచ్‌వో ఫిర్యాదు చేశారు. దీంతో సదరు నలుగురితోపాటు మరికొంత మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటన జిల్లాలో కలకలం రేపింది.

**నిబంధనలు పాటించకుంటే చర్యలు**

ప్రభుత్వ నిబంధనల ప్రకారమే దవాఖానలు, స్కానింగ్ కేంద్రాలు, డయాగ్నొస్టిక్ సెంటర్లు నిర్వహించాలి. ఎక్కడ నిబంధనలు పాటించకపోయినా చర్యలు తీసుకుంటాం. మా డ్యూటీని మేం చేస్తాం. విధి నిర్వహణలో ఆటంకాలు కల్పిస్తే వారే చట్ట ప్రకారం శిక్షార్హులవుతారు.

-అన్నప్రసన్న కుమారి, డీఎంఅండ్‌హెచ్‌వో (పెద్దపల్లి)

**నిబంధనలు బేఖాతర్**

పెద్దపల్లి జిల్లాలో స్కానింగ్ సెంటర్లు నిబంధనలకు తిలోదకాలిస్తున్నాయి. జిల్లా కేంద్రంతోపాటు గోదావరిఖని, మంథని, సుల్తానాబాద్, ధర్మారం మండల కేంద్రాల్లో కొన్ని అనుమతులు లేకుండానే ఏర్పాటయ్యాయి. లింగనిర్ధారణ, అబార్షన్లు చేయడం చట్టరీత్యా నేరం అయినా.. ఇష్టారాజ్యంగా స్కానింగ్ చేస్తున్నాయి. అయితే కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు నాయకుల భాగస్వామ్యంతో దవాఖానలు, స్కానింగ్ సెంటర్లను ఏర్పాటు చేసి ప్రజల నుంచి పెద్ద ఎత్తున డబ్బులు గుంజుతున్నారన్న విమర్శలున్నాయి. అనుమతులు లేకుండానే.. రిజిస్ట్రేషన్ చేయించకుండానే వైద్యం, స్కానింగ్ చేస్తున్నా పట్టించుకోవడం లేదని తెలుస్తున్నది. ఒక వేళ అధికారులు దాడులు చేస్తే.. వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నారనే విమర్శలున్నాయి. అయితే ఇదంతా అధికార పార్టీల నాయకుల అండదండలతోనే చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

## ప్రైవేట్ దవాఖానలు నిబంధనలు పాటించాలి

విద్యానగర్, మే 1: ప్రైవేట్ హాస్పిటల్స్ నిబంధనలు తప్పక పాటించాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. ప్రైవేట్ హాస్పిటల్స్ నిర్వహణ అనుమతులకు సంబంధించిన జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ కమిటీ సమావేశం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో గురువారం జరిగింది. కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ, ప్రైవేట్ హాస్పిటల్స్ ఆస్తి పన్ను, నీటి పన్ను నిర్దిష్ట సమయంలో చెల్లించాలని, ఇతర నిబంధనలు పాటించాలని స్పష్టం చేశారు. ప్రైవేట్ హాస్పిటల్స్‌లో ప్రభుత్వం నిర్వహించే ఆరోగ్య మహిళా ఉచిత వైద్య పరీక్షల బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ, ప్రతి ప్రైవేట్ హాస్పిటల్ పార్కింగ్ సౌకర్యం విధిగా ఉండాలన్నారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, జిల్లా ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి, ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు ఎనమళ్ల నరేశ్, హెచ్ఈవో బాలయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ముగ్గురిపై చీటింగ్ కేసు

జమ్మికుంట, మే1: విదేశాలకు టికెట్ బుక్ చేస్తామని చెప్పి రూ.6లక్షలు తీసుకుని మోసం చేసిన హెడ్ కానిస్టేబుల్ సహా మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు జమ్మికుంట పట్టణ సీఐ వీ రవి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లికి చెందిన వొల్లాల రవీంద్రనాథ్‌గౌడ్ కూతురు ఉన్నత విద్య కోసం యూఎస్‌ఏకు వెళ్లేందుకు సిద్ధమైంది. రవీంద్రనాథ్ కరీంనగర్‌లోని అమృత ట్రావెల్స్ యజమానికి దయ్యాల సతీశ్‌ను సంప్రదించాడు. తన బాబాయ్ దయ్యాల శ్రీనివాస్ జమ్మికుంటలో హెడ్ కానిస్టేబుల్‌గా చేస్తున్నాడని చెప్పాడు. హెచ్‌సీపై నమ్మకంతో సతీశ్‌కు రవీంద్రనాథ్ గౌడ్ ఫోన్ పే ద్వారా రూ. లక్షా 80వేలు చెల్లించాడు. 2023 అగస్టు 13న టికెట్ బుక్ అయిందని సతీశ్ నమ్మబలికాడు. దీంతో బాధితుడు తన కూతురు ఫీజు బ్యాంకు ద్వారా రూ.40లక్షల రుణం తీసుకుని కాలేజీకి చెల్లించాడు. 13వ తేదీన వెళ్లాల్సిన బాధితుడి కూతురు టికెట్ టెక్నికల్ సమస్య వల్ల రద్దు అయిందని సతీశ్ చెప్పాడు. టికెట్ కోసం రూ.3లక్షల 25 వేలు ఇవ్వాలని కోరగా, రూ.2లక్షలను రవీంద్రనాథ్, సతీశ్‌కు ఇచ్చాడు. మొత్తం డబ్బులు రీఫండ్ వస్తుందని నమ్మబలికి మరో రూ.3లక్షల 27వేలను ఫోన్ పే ద్వారా తీసుకున్నాడు. ఈ వ్యవహారంలో మధ్యవర్తిగా ఆంధ్రప్రదేశ్‌లోని కడపకు చెందిన నవీన్ వ్యవహరించాడు. దాదాపు రెండేళ్లుగా తిప్పుకొంటూ తీసుకున్న డబ్బులు ఇవ్వలేదని, ముగ్గురు కలిసి రూ.6లక్షలు మోసం చేశారని బాధితుడు రవీంద్రనాథ్‌గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్(కరీంనగర్), నవీన్, సతీశ్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ రవి చెప్పారు.

## దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేద్దాం

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్
- మేడే సందర్భంగా సీఐటీయూ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ




*జెండా కూడలిలో జెండాను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు*

పెద్దపల్లి టౌన్, మే 1 : కార్మికవర్గం 18 గంటల పనిదినం నుంచి 8 గంటల పనిదినం కోసం ఉవ్వెత్తున జరిగిన పోరాటంలో వేలాది మంది అమరుల త్యాగాలఫలమే నేడు కార్మికులందరూ జరుపుకుంటున్న మేడే స్ఫూర్తితో 20న, నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెలో లక్షలాది మంది కార్మికులు పాల్గొని విజయవంతం చేద్దామని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని జెండా లేబర్ అడ్డా వద్ద సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భూపాల్ మాట్లాడారు. ప్రపంచ మేడే సందర్భంగా సీఐటీయూ ఆధ్వర్యంలో కార్యాలయం నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు కార్మికులు ఎర్ర జెండాలు పట్టుకొని భారీ ర్యాలీ తీశారు. అనంతరం శాంతినగర్‌లోని సీపీఎం జెండాను ముత్యంరావు, ప్రభుత్వ దవాఖాన ఆవరణలో జ్యోతి, బస్‌సాండ్ ఆటోస్టాండ్ వద్ద కే అశోక్, మున్సిపల్ కార్యాలయం వద్ద ముత్యంరావు, సీపీఐ జెండాను జిల్లా కార్యదర్శి సదానందం, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జెండాను లింగమూర్తి ఎగురవేశారు. సీఐటీయూ, ఏఐటీయూసీ, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు చంద్రయ్య, ఎండీ ఖాజా, వెంకటస్వామి, శ్రావన్, సాగర్, నరేశ్, లక్ష్మి, సుశీల, రాజయ్య, రామలక్ష్మి, మానస్‌కుమార్, ఉదయ్‌కుమార్, బాలకృష్ణ, కిరణ అన్వేశ్, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### టీబీజీకేఎస్ కార్యాలయంలో మేడే ఉత్సవాలు

గోదావరిఖని, మే 1: పట్టణంలోని తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం కేంద్ర కార్యాలయంలో టీబీజీకేఎస్ ఆర్జీ-1 ఉపాధ్యక్షుడు వడ్డెపల్లి శంకర్ ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలు జరిగాయి. సీనియర్ ఉపాధ్యక్షుడు నూనె కొమురయ్య మేడే పతాకాన్ని గురువారం ఎగురవేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, సింగరేణిలో ప్రవేటీకరణకు, కేంద్రం తీసుకువచ్చిన లేబర్‌కోడ్‌లకు వ్యతిరేకంగా కార్మికవర్గం మేడే స్ఫూర్తితో ఉద్యమించాలన్నారు. ఇక్కడ నాయకులు చెల్పూరి సతీశ్, ఇందూరి సత్యనారాయణ, మధుంపల్లి రాజేశం, దూట శేషగిరి, రోడ్డ సంపత్, వాసర్ల జోసెఫ్, సాయికృష్ణ, తిరుపతి, గోపి,లక్ష్మణ్, సురేందర్, వెంకట్‌రెడ్డి, మీస రాజు, గడ్డి శ్రీనివాస్ అనురాజ్, భాస్కర్, నూతిరాజ్‌కుమార్, దేవేందర్, నరేశ్ ఉన్నారు.

**ఏఐటీయూసీ ఆధ్వర్యంలో..**

సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆర్జీ-1 పరిధిలోని బొగ్గు గనులు, డిపార్టుమెంట్, ఓసీపీ 5, భాస్కర్‌రావు భవన్‌లో జరిగిన మేడే వేడుకలకు యూనియన్ ఉప ప్రధానకార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, అర్జీ-1 బ్రాంచీ కార్యదర్శి ఆరెల్లి పోశం మేడే పతాకాలను ఆవిష్కరించి మాట్లాడి, కార్మిక మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అలాగే తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఓల్డ్‌అశోక టాకీస్, చౌరస్తా, ఓసీపీ 5లో మేడే జెండాల ఆవిష్కరణ జరిగింది. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి కుమారస్వామి, మీర్జా ఫయాజ్ బేగ్, ఉరవకొండ వీరయ్య, నీరటి శంకర్, ఉద్, జీవీ రాజు, తెలంగాణ జనసమితి నాయకులు రాజ్‌కుమార్, ప్రజాకళాకారులు ఉన్నారు.

### మండలంలో సమ్మర్ క్యాంపులు ప్రారంభం

ముత్తారం, మే 1: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 1 నుంచి 10 వరకు సమ్మర్ క్యాంప్‌ను నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి ఎన్ హరిప్రసాద్ తెలిపారు. మండలంలోని ఖమ్మంపల్లి ప్రాథమిక పాఠశాలలో సమ్మర్ క్యాంపును గురువారం ఆయన ప్రారంభించారు. అదేవిధంగా ముత్తారం, సీతంపేట, జిల్లెల్లపల్లి, పారుపల్లి, ఓడేడు, అడవీ శ్రీరాపూర్, హరిపురం, కేశనపల్లి, మచ్చుపేట, మైదంబండ గ్రామాల్లో వలంటీర్ల ద్వారా శిబిరాలను ప్రారంభించినట్లు తెలిపారు. 1 నుంచి 7వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఈ శిబిరంలో ఆటలు, ఆంగ్లం, తెలుగు, గణితం, చిత్రలేఖనంలో మెలకువలను నేర్పడం జరుగుతందని తెలిపారు.